“ఏమిటో నాకేం అర్థం కావడంలేదు ..... అయితే రా ..... ” అంటూ లేచి, నర్సులకోసం కేటాయించిన రూముల్లో ఓ రూమ్‌ని చూపించింది.

“ఇక్కడ నువ్వు ఎన్నాళ్ళయినా వుండొచ్చు. నీకేవయినా కావలసివస్తే, ప్యూన్ వుంటాడు చెప్పు ..... ” అంది ఒకింత బాధగా హేమలత .

తనకు కేటాయించిన గదిలోకెళ్ళి మంచంమ్మీద కూర్చుంది మహతి.

తన కార్యక్రమాన్ని ఎక్కడనుంచి ప్రారంభించాలో ఆలోచిస్తుంది.

* * * *

బ్రేక్‌ఫాస్ట్ చేసి వస్తున్నాడు మధుకర్, మూర్తి. సీనియర్ స్టూడెంట్స్ అందరూ మధుకర్ అక్కడ ఆ సమయంలో కనబడడంతో ఆశ్చర్యాన్ని మొహంమ్మీద పులుముకొని విష్ చేస్తున్నారు.

“ఇంకో మూడ్నెల్లు గడిస్తే డిగ్రీ వచ్చేస్తుంది. ఈ సమయంలో నువ్వు చదువు మానేసి, ఆ పిల్ల ఛాలెంజ్ చేసిందని, నువ్వు ఛాలెంజ్ చేసి, అన్నీ వదులుకొని బాధలు పడడం మాత్రం నాకేదోలా వుందిరా” అన్నాడు మూర్తి జరిగిందంతా తెలుసుకున్నాక.

రోజువారీ సగం ఖర్చులు మధుకర్ వల్లే జరిగిపోతాయి. అలాంటి మధుకర్ పాపర్‌లా తిరిగితే తనని చూసేవాడెవ్వడు?

“ఎవర్నీ కన్‌సల్ట్ చెయ్యకుండా నువ్వీ నిర్ణయం తీసుకోడం ఏం బాగాలేదురా” మళ్ళీ బాధగా అన్నాడు మూర్తి.

ఇద్దరూ హాల్లోకొచ్చారు.

మూర్తి జేబులోంచి సిగరెట్ పాకెట్‌తీసి ఆఫర్ చేసాడు.

“నో థాంక్స్ ..... మానేసాను.”

“అయ్యబాబోయ్ ..... ఒరే మధూ ..... చాలా అన్యాయంరా. చైన్ స్మోకర్ సిగరెట్టు మానేస్తే, సిగరెట్ కంపెనీలేమైపోతాయిరా? చౌరంగీలేన్ మొత్తం మూతబడిపోతుందిరా.”

అయినా మధుకర్ మాట్లాడలేదు.

“అయితే ఏం చేద్దామని నీ ఉద్దేశ్యం”

“యింకా ఆలోచించుకోలేదు. మన దయాళ్, సురేష్, విజయ్‌లతో చెప్పు. రాత్రికి వాళ్ళిక్కడికి రమ్మను. ఓ రెండ్రోజులు మాత్రమే నీ రూంలో వుంటాను. ఈ లోపల నా ఏర్పాట్లు నేను చూసుకుంటాను. సాయంత్రం కలుస్తాను” ఎప్పుడూ కార్లో, హడావుడిగా వెళ్ళే మధుకర్ అలా సామాన్యుడిలా వెళుతుంటే జాలేసింది మూర్తికి.

ప్రపంచంలోని బలహీనతలన్నీ మూర్తికి తెలుసు. కాని ఒక అందమైన అమ్మాయి కూడా- ఆ అమ్మాయి విధించిన షరతులు కూడా బలహీనతలు కావటాన్ని జీర్ణించుకోలేకపోయాడు. అప్పటికి సమయం తొమ్మిది గంటలవుతోంది.

సిటీ వేపెళ్ళే బస్సెక్కాడు.

యూనివర్శిటీ లైబ్రరీకెళితే అందరూ తననే చూస్తారు. అందుకే చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీకెళ్దామని నిర్ణయించుకున్నాడు.

ఏం చెయ్యాలో తోచని పరిస్థితుల్లో పుస్తకాల్లోకి చూడు -- నీకు చాలా విషయాలు తెలుస్తాయి-- ఎప్పుడో , ఎవరో చెప్పినట్లు జ్ఞాపకం, బహుశా తండ్రేనేమో-- అకస్మాత్తుగా తల్లీ తండ్రి జ్ఞాపకానికివచ్చారు.

ఈ సమయంలో తండ్రి పూజ గదిలో వుంటాడు. తల్లి టిఫిన్ చేస్తూ తన గురించే ఆలోచిస్తుంటుంది. పాపం మదర్ ..... తను వచ్చేసాక బాగా ఏడ్చి వుంటుంది. నారాయణ గూడా స్టాప్ దిగి చిక్కడపల్లివేపు నడిచాడు.

అంత ఉదయాన్నే లైబ్రరీకి ఎవరొస్తారు. ఓ అరడజను మంది వృద్ధులు డైలీ పేపర్ సెక్షన్‌లో కూర్చుని పేపర్స్ తిరగేస్తున్నారు.

జనరల్ సెక్షన్‌లోకి నడిచాడు. ఒక్కసారి ఆ గదిలో కెళ్ళగానే పాత పుస్తకాల వాసన. కాలేజీలో అన్నేళ్ళు చదివినా, ఒక్కసారి కూడా లైబ్రరీకి వెళ్ళలేదు. అలాంటి వాడు ప్రత్యేకంగా లైబ్రరీకి రావడం. తనేం చెయ్యాలో నిర్ణయించుకోడానికి పుస్తకాల్ని రిఫర్ చెయ్యటం కోసం తెలుగు విభాగంలోకి రాగానే ఏదో పుస్తకం కనిపించింది.

“రండి ఈ ప్రపంచాన్ని జయిద్ధాం” టైటిల్ ఆసక్తికరంగా వుంది. చేతిలోకి తీసుకుని రీడింగ్ టేబుల్ చుట్టూ వున్న కుర్చీల్లో ఓ కుర్చీలో కూర్చున్నాడు.

విజయం అనేది మనిషిలోని పంతం, పట్టుదలతో ప్రారంభమవుతుంది. పైకి తేవడానికి, నీ శక్తియుక్తుల్ని కేంద్రీకరించినప్పుడు--

నిన్ను ఆపడం-

నీ అడ్డుగా నిలవడం--

ఎవడివల్లా సాధ్యం కాదు.

అది మాత్రం గుర్తుంచుకో.

--ఆ చాప్టర్ని చదివి ఒక్కసారి కళ్ళు మూసుకున్నాడు మధుకర్ . గొప్ప ఇన్‌స్పిరేషన్, అతని నరనరంలో ప్రవహించింది. ఆ అక్షరాల్లోని అంతులేని శక్తి అతనిలోకి నడిచి వచ్చినట్టయింది. ఈత కొట్టడానికి ముందు, ఈతగాడు ఒడ్డున నిలబడి దమ్ము కూడదీసుకుంటున్నట్టుగా వుంది అతనికి.

తను అనుకున్నది ఏడాదికాలంలో కాదు-- ఆర్నెల్ల కాలంలోనే సాధిస్తాడు.

అవును ..... సాధిస్తాడు.

తనకా నమ్మకం వుంది.

ఏవేవో అస్పష్టమైన ఆలోచనలు అతని మెదడులో రూపుదిద్దుకుంటున్నాయి. పది నిమిషాల సేపు అతనలాగే వుండిపోయాడు.

నెమ్మదిగా లేచి, ఆ పుస్తకాన్ని యధాస్థానంలో వుంచి ఇంగ్లీషు విభాగంలో కన్పించిన ఓ పుస్తకాన్ని తీశాడు.

ENTERPRENERSHIP AND GROWTH OF ENTERPRISE IN INDUSTRIAL ESTATES.

బిజినెస్ మాగ్నెట్ కొడుకు కావడం వల్ల ఆ పేరు చూడగానే అతన్ని ఆకర్షించింది.

రచయిత పేరు చూసాడు.

Dr. N. GANGADHARA RAO

వరసగా పేజీలు తిప్పుతున్నాడు.

సక్సెస్‌ఫుల్ వ్యాపారవేత్తకు ఉండాల్సింది చదువు, డిగ్రీలు కాదు. వ్యాపారదక్షత. మానవ స్వభావాన్ని విశ్లేషించి, మంచి చెడులను చూడగలిగే ప్రతీవాడు సక్సస్‌ఫుల్‌గా తన జీవితాన్ని మలచుకోగలడు. మధుకర్ దృష్టి ఒక చాప్టర్ దగ్గర ఆగింది.

A Mischievous College Student becoming an enter-Preneur Spears of the Significance role played by Industrial estates.

అది చూడగానే వీడెవడో తనలాగే వున్నాడు అనుకున్నాడు మధుకర్ . ఆంధ్రప్రదేశ్‌లో వెనకబడిన జిల్లాల్లో ఒకటైన శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు చెందిన వెంకట్రావ్ అనే యువకుడు, అల్లరి చిల్లరిగా వున్నాడని, తను చదువుతున్న చదువుకి న్యాయం చేయలేదనే కోపానికి గురై బయటికి వచ్చి, తన స్వశక్తితో, ఎలా ఒక వ్యాపారవేత్తగా పరిణామం చెందాడో రచయిత వివరించాడు.

ఇరవై ఆరేళ్ళ వెంకట్రావ్, ఆముదాలవలసలోని కోర్ణకోట గ్రామానికి చెందినవాడు. ఆ సమయంలోనే, అతను శ్రీ శ్రీనివాసా నవ్వార్ టేప్ ఇండస్ట్రీకి రూపకల్పన చేసాడు. అప్పట్లో అది శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు ఏకైక నవ్వార్ టేప్ ఇండస్ట్రీ.

ఆ ఇండస్ట్రీ స్థాపన వెనక ఒక ఆసక్తికరమైన కథ వుంది. అంతకుముందు అతను శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో బి.కాం. చదువుతుండేవాడు. స్టూడెంట్స్ యూనియన్‌కి ఛైర్మన్‌గా, లాంగ్వేజ్ అసోసియేషన్‌కి కార్యదర్శిగా, స్కూల్లో స్టూడెంట్స్ అందరికీ తలలో నాలుకలా వుండేవాడు. తనెప్పుడూ నాగావళి నదిలా ఉత్సాహంగా వుంటూ, విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేవాడు.

కానీ అలాంటివాడు ప్రిన్సిపాల్ కోపానికి గురయ్యాడు. తనేం తప్పు చేయలేదని వెంకట్రావ్ వాదన. కానీ తనని కాలేజీనుంచి పంపించెయ్యడమే కాకుండా, తనని అసభ్యమైన పదజాలంతో దూషించినందుకు ప్రిన్సిపాల్ మీద హైకోర్టులో కేసు కూడా వేశాడు వెంకట్రావ్. కొంత గొడవ సహజంగా జరిగింది. ఈ కారణంగా ప్రిన్సిపాల్ దృష్టిలో వెంకట్రావ్ అల్లరి విద్యార్థిగా గుర్తింపు పొందాడు. దాంతో మానసికంగా చాలా బాధపడ్డాడు వెంకట్రావ్. నిజాన్ని
గుర్తించలేని పరిస్థితిలో అబద్ధమే నిజంగా చలామణీ అవుతుందని వెంకట్రావ్ నమ్మాడు. దాంతో చదువుమీద విముఖత ఏర్పడింది.

చదువు ఆగిపోయింది. మరి చదవాలంటే ధ్యాస కూడా లేదు. ఏం చెయ్యాలని ఆలోచనలో పడిన సమయంలో తండ్రి అన్నగార్ల సలహాతో నవ్వార్ టేప్ ఇండస్ట్రీస్ పెట్టాడు. ఆ యూనిట్ మంచాలకు నవ్వార్‌ని, కిరోసిన్ దీపాలకు వత్తుల్ని తయారుచేస్తుంది. ప్రారంభ సంవత్సరంలో దానికి వెంకట్రావ్ పెట్టిన పెట్టుబడి 50 వేలు మాత్రమే. అప్పట్లో అతని దగ్గర 15 మంది పనిచేస్తుండేవారు.

స్వయం ఉపాధి పథకం వెంకట్రావ్ ప్రారంభించిన నవ్వార్ టేప్ ఇండస్ట్రీని అంచెలంచెలుగా తన కృషితో, దీక్షతో పైకి తీసుకొచ్చాడాయన.

తను పుట్టి పెరిగిన ప్రదేశంలో తను వ్యాపారవేత్తగా మారిన వెంకట్రావ్‌ది ఒక కథ అయితే , విజయనగరానికి చెందిన టి. రాజగోపాలరావుది ఇంకొక ఆసక్తికరమైన కథ.

ఇవ్వాళ, రేపు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతి విద్యార్థి ఫారిన్ కంట్రీస్ వెళ్ళడానికి చూపెట్టే ఆసక్తి, స్వంతఊళ్ళోగాని, స్వంత రాష్ట్రంలో గానీ ఉండడానికి చూపించడం లేదు దానిక్కారణం - ఇక్కడ మనం బతకలేం- ఇక్కడ బతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయి అని అనుకోవడమే. అది తప్పు. మనసుంటే మార్గం

వుంటుంది. స్థిరపడాలనే చిత్తశుద్ధి వుంటే ఎక్కడయినా తన తెలివితేటల్ని నమ్ముకొని, అమ్ముకుని స్థిరపడొచ్చు-- తను స్థిరపడడమే కాకుండా, మరి కొంతమందికి ఉద్యోగావకాశాన్ని సృష్టించవచ్చు. టి. రాజగోపాల రావు , కృష్ణాజిల్లా, గుడివాడ సమీపంలోని అంగలూరులో 1920 లో పుట్టాడు. 1947 లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఎస్.సి చేశాడు. ఆ తరువాత ప్రభుత్వ ఉపకార వేతనమ్మీద తోళ్ళ పరిశ్రమ విషయంలో కృషి చెయ్యడానికి అమెరికా వెళ్ళాడు. 1951 లో అక్కడనుంచి విశేష అనుభవంతో తిరిగొచ్చిన రాజగోపాల రావు స్వంతవూరికి ఎంతో దూరంలోవున్న విజయనగరంలో నెల్లిమర ప్రాంతంలో "The Associated Tanners" అనే కంపెనీ పెట్టాడాయన.

అసోసియేటెడ్ టానర్స్ ప్రారంభించినప్పుడు దాని పెట్టుబడి కేవలం 80 వేలు మాత్రమే. అప్పటికి అవసరమైన ఆ డబ్బును సంపాదించడానికి ఆయన తన పొలాన్ని అమ్మేశాడు. కొంతమంది బంధువులు స్నేహితుల దగ్గర్నుంచి కూడా ఆర్థిక సహాయాన్ని తీసుకున్నాడు. ప్రారంభించిన అనతికాలంలోనే అసోసియేట్ టానరీస్ అభివృద్ధి పథంలోకి దూసుకుపోయింది. ఫ్యాక్టరీకి లభించే ఆదాయంలో విదేశాలకు చేసిన ఎగుమతులవల్లే 50 శాతం ఆదాయం లభిస్తోంది.

ప్రధానంగా అసోసియేటెడ్ టానరీస్‌లో రెండు విభాగాలున్నాయి. ఒకటి పాదరక్షల తయారీ విభాగం-- రెండు తోళ్ళ విభాగం -- పాదరక్షల విభాగం 1972 లో ప్రారంభమైంది. బాటా ఇండియా లిమిటెడ్‌కు పాదరక్షల్ని సరఫరా చేసే యూనిట్లలో యిదొక యూనిట్ అంటే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఈ యూనిట్‌లోనే పాదరక్షలు తయారుచేసి బాటా స్టిక్కర్స్ అంటించి-బాటా కంపెనీ పంపమన్న చోటికి పంపుతుంది.

మనం ఈనాడు కొంటున్న బాటా బ్రాండ్ పాదరక్షలు తెలుగువారు తయారుచెయ్యటం గర్వకారణం కాదా!

ఆనాటి రాజగోపాలరావు వ్యూహవల్ల ఈనాటి యువతరం ఎంతయినా నేర్చుకోవాల్సిన అవసరం వుంది.

లెదరు టెక్నాలజీలో తను కృషి చేసాడు కాబట్టి ఏ విదేశంలోనో ఆయన స్థిరపడాలని అనుకోలేదు-- తను ఏదయితే నేర్చుకున్నాడో, తను ఏదయితే చెయ్యాలనుకున్నాడో, ఆ పరిశ్రమను స్థాపించడానికి ఆయన కృషి చేశాడు- చదువుకున్నవాడు, వ్యవహారజ్ఞానం తెల్సినవాడు, ఎక్కడయినా స్థిరపడగలడు అని రుజువుచేశాడు. ఈ మూడు విషయాలు ఆయన జీవితంలోంచి నేటి యువతరం నేర్చుకోవాల్సిన అంశాలు. ఇది చదివాక వరసగా పేజీలన్నీ ఆసక్తిగా తిప్పాడు మధుకర్. 60, 70 ప్రాంతంలో మన రాష్ట్రంలో ప్రారంభమైన ఎన్నో వ్యాపారాలు, ఆ వ్యాపారాలను తెలివితేటలతో అభివృద్ధిచేసిన వ్యాపారస్తుల వివరాలు దానికితోడు, అలసత్వం, అజ్ఞానం, తొందరపాటుతనంవల్ల బంగారం లాంటి వ్యాపారాన్ని పాడుచేసుకున్న వారి వివరాలు కూడా అందులో వున్నాయి.

ఆ పుస్తకాన్ని అటూ ఇటూ తిప్పి చూశాడు. ఎప్పుడు ప్రింటయిందో వివరాలు చూశాడు. పదేళ్ళక్రితం ప్రింటయినా, ఇప్పటికీ కొత్తగానే వుంది-అంటే-ఏ ఒక్కరు దాని జోలికి వెళ్ళి వుండరు.

మంచి పుస్తకాలెప్పుడూ లైబ్రరీలో పదిలంగా భద్రంగా వుంటాయి. వాటిజోలికి ఎవరు వెళ్ళకపోవడమే అందుకు కారణం. ఇక దేశమెలా బాగుపడుతుంది? సెక్స్, బూతు, కలలు, కల్పనలు ఇవే చదివే వాళ్ళు ఎలా ఎదుగుతారు? కాలక్షేపాన్నిచ్చే పుస్తకాలు అట్టలు మాత్రం చిరిగిపోయుంటాయి. ఈ పుస్తకం యిప్పుడు కొనాలంటే బజార్లో దొరకదు. ఎలా ..... లైబ్రేరియన్ అడిగితే యివ్వకపోవచ్చు ఎవ్వరికి నచ్చిన పుస్తకాన్ని వాళ్ళూ తీసుకుపోతామంటే?

తన ఆలోచనకు తనకే నవ్వొచ్చింది. అయినా సందేహ నివృత్తి కోసం లైబ్రేరియన్దగ్గర కెళ్ళాడు.

తనదగ్గరికే వస్తున్న ఆ కుర్రాడివైపు లైబ్రేరియన్ తలెత్తిచూశాడ. ఏంకావాలన్నట్టుగా.

"ఈ పుస్తకం నాక్కావాలి" అన్నాడు ఆయనవేపు చూసి.

"మీరు సబ్స్క్రైబరేనా ..... సబ్స్క్రైబరైతే పట్టుకెళ్ళండి. నాకేం అభ్యంతరం లేదు. పదేళ్ళుగా ఆ పుస్తకాన్ని ఎక్కడుందో, అక్కడే చూస్తున్నాన్నేను.

ఏ ఒక్కరూ ముట్టుకున్న పాపానికి పోలేదు. మీరెందుక్కావాలంటున్నారో నా కర్థం కావడంలేదు"

చాలా ఆసక్తిగా అన్నాడు ఆయన.

"మంచి పుస్తకాన్ని చదవాలనుకోవడంలో తప్పులేదు కదా" జవాబిచ్చాడు మధుకర్ .

"ఈ రోజుల్లో సెక్స్, బూతు, రొమాన్స్, వూహలు, మేడలు, వయొటిన్స్, గేంగ్వార్స్ గురించి వున్న పుస్తకాల్నే అందరూ ఇష్టపడుతున్నారు. అందుకే దేశం ఇలా తగలబడిపోతుంది" లైబ్రేరియన్ తన ధోరణిలో అన్నాడు.

మధుకర్ పెదాలు విడవకుండా నవ్వుకున్నాయి.

"అయితే సబ్స్క్రిప్షన్ కడితే ఇస్తారా?" అడిగాడు మధుకర్ .

"ఓ నిరభ్యంతరంగా" చెప్పాడాయన.

"సబ్స్క్రిప్షన్కి ఎంత కట్టాలి" అడిగాడు మధుకర్ .

"మీరు సబ్స్క్రిప్షన్ కట్టినా యివాళ మాత్రం మీకా పుస్తకం రాదు. ఇవాళంతా అక్కడ కూర్చొని ఆ పుస్తకం చదువుకోండి. రేపుదయాన్నే తొమ్మిదికల్లా వస్తే, ఆ పుస్తకం మీకిస్తాను" ఆ వ్యక్తి చెప్పడంతో మళ్ళీ తన ప్రదేశంలోకి తనొచ్చి కూర్చున్నాడు మధుకర్ .

అప్పటికి పదిన్నర గంటలయింది.

మరోసారి పుస్తకం తిరగేశాడు. ఆ పుస్తకంలో చాలా అమూల్యమైన విషయాలున్నాయి.